క్లుప్తంగా

మహేశ్వరం బరిలో 27 మంది

మహేశ్వరం: నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగిసింది. మహేశ్వరం అసెంబ్లీ స్థానం నుంచి 32 మంది అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించారు. అందులో ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 27 మంది బరిలో ఉన్నట్లు మహేశ్వరం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్ పేర్కొన్నారు. అరవింద్‌రెడ్డి మర్యాద, మహ్మద్ ఖలీల్ ఉజ్మా, జే. మహేశ్ కుమార్, గుడిపల్లి నర్సింగ్‌రావు, ఎస్.రాము యాదవ్ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పోటీలో 27 మంది నిలిచారు.

మిత్రుల ఔదార్యం



డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేస్తున్న స్నేహితులు

కందుకూరు: తమతో పాటు చదువుకున్న చిన్ననాటి మిత్రుడు మృతి చెందడంతో అతని కుటుంబాన్ని స్నేహితులు ఆదుకున్నారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన కావలి శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతనితో పాటు కందుకూరు జెడ్పీ పాఠశాల 1998–99లో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులంతా రూ.80 వేలు జమ చేశారు. ఈ మొత్తాన్ని మృతుడి భార్య పేరుతో పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. బుధవారం పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దిలీప్‌కుమార్‌ను కలిసిన కేఎల్లార్



దిలీప్‌కుమార్‌తో లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్‌ను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి బుధవారం కలిశారు. తనకు మద్దతు ఇవ్వాలని, మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపునకు సహకరించాలని దిలీప్‌కుమార్‌ను కోరినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం



వేడుకలో పాల్గొన్న సినీనటుడు నాగినీడు తదితరులు

వనస్థలిపురం: చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయం గ్రేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం రాత్రి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు వి.నాగినీడు చదువు, నడవడిక, భవిష్యత్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. గొర్రెపాటి నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా భువనగిరి జిల్లా సీనియర్ సెషన్స్ జడ్జి మురళీమోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో చిన్నారులు వైష్ణవి, మేడిని, . ద్రువ, అపూర్వ, హాస్య, సంప్రీతి, తీర్థ, ఆఫ్సిన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పోలింగ్ బూత్‌ల పంచాయితీ

దిల్‌సుఖ్‌నగర్: బూత్‌ల కోసం టీఆర్‌ఎస్ నాయకులు గొడవకు దిగారు. ఒకరినొకరు బూతులు తిట్టుకుంటూ పరస్పరం దాడి చేసుకున్నారు. వివరాలు... ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్‌లో కొంతకాలంగా పాత, కొత్త నాయకుల మధ్య వివాదం నడుస్తోంది. ఎన్నికల బూత్‌ల బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న చర్చ జరగడంతో పాత, కొత్త నాయకుల మధ్య వివాదం మొదలైంది. బూత్‌ల బాధ్యత మాకు కావాలంటే...కాదు.. కాదు మాకే ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. మొదట చిన్నగా ప్రారంభమైన గొడవ చినికి చినికి గాలివానగా మారి నాయకులు కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో రంగంలోకి దిగిన నియోజకవర్గ స్థాయి నాయకులు కొందరు వారిని మందలించి గొడవ సద్దుమణిగేలా చేశారు. రానున్న రోజుల్లో ఈ గొడవ ఎక్కడి వరకు వెళ్తుందోనని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి లంగిడి పోటీలకు ఎంపిక

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు జాతీయస్థాయి లంగిడి పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రంలోని థాణెలో జరిగే జాతీయస్థాయి లంగిడి పోటీల్లో స్పందన, స్వాతి, శివాని, విజయ ఎంపికైనట్లు పాఠశాల పీడీ సుశీల తెలిపారు.

ఆడబిడ్డలా ఆదరించండి

- కారు గుర్తుకు ఓటేయండి
- మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మకండి
- అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం
- మంత్రి సబితారెడ్డి
- కందుకూరు మండలంలో ఎన్నికల ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న సబితారెడ్డి తదితరులు

కందుకూరు: ఆడబిడ్డలా తనను ఆదరించి మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అభ్యర్థించారు. కులం, మతం పేరుతో ఓట్ల కోసం వచ్చే పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి కేసీఆర్ పాలన వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. బుధవారం మండల పరిధిలోని 11 గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తుందన్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో సామాజిక పెన్షన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, మిషన్‌భగీరథ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. రూ.660 కోట్లతో శంషాబాద్ మీదుగా కందుకూరు, ముచ్చర్ల గేట్ వరకు మెట్రో రైలు ఏర్పాటు చేయనున్నారని, మీర్‌ఖాన్‌పేట వద్ద 450 పడకల ఆస్పత్రి, కళాశాల ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. లావణ్య పట్టాలకు అన్ని హక్కులు కల్పిస్తామని, దీంతో ఆ భూములున్న పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, జయమ్మ రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ పాండు, సీనియర్ నాయకులు కె.దశరథ, లచ్చానాయక్, కె.జయేందర్, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పారిజాతం, బాబయ్య, సామయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు సుమన్, అనిత, శ్రీదేవి, మంద సాయిలు, శ్రీనివాస్, బాలకృష్ణ, సోమ్లానాయక్, ఎంపీటీసీలు లలితకుమార్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

హయత్‌నగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా కష్టపడాలని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ లన్నారు. బుధవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'వ్యక్తిత్వ వికాసం' అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు, జల్సాల జోలికి పోకూడదని సూచించారు. ఆడపిల్లలు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని తల్లిదండ్రులు, గురువులు, పెద్దలపై గౌరవంతో ఉండాలన్నారు. నూతనంగా ఓటుహక్కును పొందిన విద్యార్థులు సరైన అభ్యర్థిని ఎంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చింతల రాకేశ్ భవానీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ జాహెదాబేగం, ఉపేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్

తుర్కయంజాల్: మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఇంజాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సంఘం 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇంజాపూర్‌లో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రామదాసు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి జగన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యుడు గణేశ్ పాల్గొన్నారు.

యువతరమా.. నవతరమా..



- యువ ఓటర్లే కీలకం
- కొత్త ఓటర్లు 14,039 మంది
- గెలుపోటముల్లో వీరిదే కీలక పాత్ర
- యువతను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు

హుడాకాంప్లెక్స్: యువతరమా.. నవతరమా ఇదే అదును కదలిరమ్ము... అని ఓ కవి యువతను మేల్కొల్పారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కూడా ఎవరిని అసెంబ్లీ పంపాలనే నిర్ణయం యువతీయువకుల చేతుల్లోనే ఉంది. ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపోటముల్లో వారిదే కీలకపాత్ర. అందుకే వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అన్ని పార్టీలో పోటీ పడుతున్నాయి. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా 14,039 మంది ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. వీరంతా తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. అదే విధంగా 20 నుంచి 29 ఏళ్ల వయసు వారు 11,213 మంది, 30 నుంచి 39 ఏళ్ల వయసు కల్గిన 1,66,578 మంది ఓటర్లు ఉన్నారు. వీళ్లంతా నియోజకవర్గంలో గెలుపోటములను నిర్దేశించే స్థాయితో ఉన్నారు. అందుకే వీరిని మచ్చిక చేసుకొనే పనిలో అభ్యర్థులు బిజీగా ఉన్నారు. బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే సబితారెడ్డి బరిలో ఉండగా, ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక బీజేపీ నుంచి అందెల శ్రీరాములు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా పోరాడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతో గెలుస్తారనే విశ్లేషణలు వస్తున్నాయి. ముఖ్యంగా కొత్త ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపితే.. ఆ పార్టీ అభ్యర్థికే విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. అందువల్ల కొంతమంది అభ్యర్థులు బర్త్‌డే వేడుకల పేరుతో వారికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. విందు, వినోదాలతో యువకులను ఆకట్టుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మరికొంత మంది హామీలు గుప్పిస్తూ యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

నియోజకవర్గంలో వయసు వారీగా ఓటర్లు

వయసు వారిగా	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్లు	మొత్తం
18 నుంచి 19 ఏళ్లు	8036	6003	-	14,039
20 నుంచి 29 ఏళ్లు	51956	49238	19	11,213
30 నుంచి 39 ఏళ్లు	82814	83745	19	1,66,578
40 నుంచి 49 ఏళ్లు	61461	56498	20	1,17,979
50 నుంచి 59 ఏళ్లు	39179	35863	05	75,047
60 నుంచి 69 ఏళ్లు	22903	20439	02	43,344
70 నుంచి 79 ఏళ్లు	11433	9923	02	21,358
80 ఏళ్లు పైబడిన వారు	3421	3598	-	7,019
మొత్తం	2,81,203	2,65,307	67	5,46,577

'మహేశ్వరం' మాదే

- సబితారెడ్డిని ఓడించండి
- 'గ్యారంటీ'లు తప్పకుండా అమలు చేస్తాం
- త్వరలో పార్టీలోకి వలసలు
- కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్



లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ప్రశాంత్‌రెడ్డి తదితరులు

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని తెలిపారు. మహేశ్వరం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని చెప్పారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన మంత్రి సబితారెడ్డి అధికారం కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ఆమెను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని, రైతు భరోసా ద్వారా ఎకరానికి ఏటా రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు త్వరలో కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిపారు.

కాంగ్రెస్ చేరిన నాయకులు వీరే..

బుధవారం కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్‌రెడ్డి, మంఖాల్‌కు చెందిన ఐనాల భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జయమ్మ, నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లేశ్, శ్రీను, ప్రశాంత్, శ్రీశైలం పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, సంగారెడ్డి, దానియేల్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది అవినీతి పాలన

తుక్కుగూడ: రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలన కొనసాగుతోందని కేఎల్లార్ మండిపడ్డారు. బుధవారం తుక్కుగూడలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. లక్ష్మారెడ్డి సమక్షంలో మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీపీ రఘుమారెడ్డి, నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, జానకీరామ్, జాన్, చంద్రశేఖర్‌రెడ్డి, జంపన్న, ధనుంజయ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ నాయకుడు పెద్దబావి సమరసింహారెడ్డితో పాటు పలువురు మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని కేఎల్లాఆర్ ధీమావ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాంరెడ్డి, అరవింద్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, అభిలాశ్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, శివనంద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

కేఎల్లార్‌ను గెలిపించండి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్)ను గెలిపించాలని లక్ష్మారెడ్డి సతీమణి విజయలక్ష్మి కోరారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, విజయపురిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు హామీలు అధికారంలో వచ్చిన వెంటనే తప్పకుండా అమలు చేస్తారని తెలిపారు. ప్రచారంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు గట్ల రవీంద్ర, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఏవి రావు, ఆనంద్ కుమార్, నిర్మల పాపిరెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ సుశీల, రవళి, సందీప్, నాని, నితిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కారు.. జోరు

- ఇంటింటికీ బీఆర్‌ఎస్ శ్రేణులు
- ప్రచారంలో దూకుడు పెంచిన నాయకులు
- సబితారెడ్డిని గెలిపించాలని అభ్యర్థన



రాచులూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు



తుక్కుగూడలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కారు పార్టీ జోరు పెంచింది. బీఆర్‌ఎస్ అభ్యర్థులు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఊరూరా తిరుగుతూ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా గడపగడపకూ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. మహేశ్వరంలో సబితారెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. బడంగ్‌పేటలోని ఓల్డ్ విలేజ్‌లో అభివృద్ధి చేసిన సబితారెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారం చేసిన వారిలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధి చేశాం... గెలిపించండి

మీర్‌పేట: అభివృద్ధి చేశాం.. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్ బుధవారం 36వ డివిజన్‌లో గడప గడపకూ ప్రచారం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సబితారెడ్డి అభివృద్ధి చేసిన సబితారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ఆ పార్టీ నాయకులు జోజి, నాగరాజు

కేఎల్లార్ చెల్లని నోటు

హుడాకాంప్లెక్స్: సబితారెడ్డిని గెలిపించాలని సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ అనిత బుధవారం జింకలబావి కాలనీ, డాక్టర్స్ కాలనీ, నార్త్ వికాస్‌నగర్, సాయి కృష్ణనగర్‌లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్‌లో చెల్లని నోటు మహేశ్వరంలో ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, ఐటీ కంపెనీలు రావడానికి కృషి చేసిన సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బేర బాలకిషన్, బోయిని మహేందర్ యాదవ్, అశోక్, కొండల్‌రెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి గెలిపించాలని, ఆ పార్టీ నాయకులు మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మంత్రి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యేగా సబితారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరు, చీమలవానికుంటలో బుధవారం మాజీ ఎంపీపీ శోభాఈశ్వర్‌గౌడ్, సబితారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఆమె వెంట నీలమ్మ, పుష్పమ్మ, యాదమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు సబితారెడ్డి ప్రచారం

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం, నందుపల్లి, తీగల కుంట తండా, ఏనుగు చెర్వు తండా, పడమటి తండా, ఎనేమీది తండా, నాగిరెడ్డిపల్లి, హబీబుల్లాగూడ, గొల్లూరు, అర్‌పేట్, పెద్దమ్మ తండా, నల్ల చెర్వు తండా, మాణిక్యమ్మగూడ, తుక్కుగూడ మున్సిపాలిటీ సర్దార్‌నగర్ గ్రామాల్లో నేడు (గురువారం) మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో కావాలని పార్టీ శ్రేణులు కోరారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

చైతన్యపురి: నామినేషన్ ఉపసంహరణ తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బుధవారం గుర్తులు కేటాయించినట్లు ఎల్‌బీనగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ తెలిపారు. ఎన్నికల పరిశీలకులు రాంకుమార్ సధురప్పన్ పర్యవేక్షణలో అభ్యర్థుల సమక్షంలోనే వారికి గుర్తులు కేటాయించామన్నారు. కాగా, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన ఓటరు సమాచారం స్లిప్పులను ఈనెల 22 లోగా బూత్ లెవెల్‌లో పంపిణీ చేస్తారని పంకజ తెలిపారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా సెక్టోరల్ అధికారులు, పర్యవేక్షక అధికారుల పర్యవేక్షణలో ఓటరు స్లిప్పులు అందజేస్తారన్నారు. స్లిప్పులు అందని ఓటర్లు కొత్తపేట ఈస్ట్ జోనల్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోని కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 040–24140937 కు లేదా డిప్యూటీ ఎస్టేట్ అధికారి విజయలక్ష్మిని 7702104249లో సంప్రదించాలన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి ఓట్లు దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం, వివిధ రకాల బహుమతులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో ఎన్నికల సంఘం అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా నగదు తరలించే వారిని పట్టుకుంటున్నారు. అయినా డబ్బులు పంపిణీకి నూతన మార్గాలను ఎంచుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలకు నగదును బదిలీ చేస్తే ఎలాంటి ఇబ్బందులు రాకుండా నగదును అందించవచ్చని భావిస్తున్నారు. దీంతో బ్యాంకుల ద్వారా అధిక మొత్తంలో జరిగే లావాదేవీలపై దృష్టి సారిస్తే అక్రమ నగదు పంపిణీపై మరింత దృష్టి సారించవచ్చనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం అధిక మొత్తంలో జరిగే నగదు లావాదేవీపై నిఘా ఏర్పాటు చేసింది. లక్షల నుంచి అధిక మొత్తంలో జరిగే లావాదేవీలను అధికాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపే వారి వివరాలను తమకు అందించాలని ఎన్నికల సంఘం అధికారులు బ్యాంకు అధికారులను కోరినట్టు తెలుస్తోంది.

మహిళా సంఘాల ఖాతాలపై నిఘా...

ఎన్నికల సంబంధించిన అంశంలో మహిళా ఓటర్లకు ఉన్నంత ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. మహిళా ఓటర్లను మచ్చిక చేసుకుని వారి కుటుంబీకుల ఓట్లను కూడా తమకు వేయించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సంఘాలతో అభ్యర్థులు తరఫున నియమించిన ప్రత్యేక దూతలు సమావేశాలు నిర్వహించి తమ పార్టీలకే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా వీరికి నగదు బదిలీ చేస్తే మిగతా సభ్యులకు కూడా పంపిణీ చేస్తారు. ఇలాంటి వాటిపై ఎన్నికల కమిషన్ నిఘా పెంచింది. బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు కాకుండా ఇతర వ్యక్తులు సంస్థలు నుంచి స్వయం సహాయక సంఘాలకు డబ్బు జమ అవుతున్నదా?అనే వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అక్రమంగా జరిగే లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఆ బ్యాంకు ఖాతా సీజ్ చేసేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నట్టు సమాచారం.

డిజిటల్ చెల్లింపులపై...

ఆండ్రాయిడ్ ఫోన్ అందుబాటులో ఉంటే గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా పెద్ద మొత్తంలో నగదు బదిలీ జరుగుతోంది. డిజిటల్ ఖాతాల ద్వారా లక్ష్యలో లావాదేవీలు జరిగితే సంబంధిత ఖాతాదారుల నుంచి వివరణ తీసుకునే అవకాశం ఉంది. పోటీ చేసే అభ్యర్థుల బంధువుల ఖాతా వివరాలను కూడా తీసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు నగదు బదిలీలపై మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది.